క్లుప్తంగా

పనిప్రదేశాల్లో సౌకర్యాలు కల్పిస్తాం



ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ ఏపీడీ శ్రీదేవి

కారేపల్లి: ఉపాధిహామీ పనిప్రదేశాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని డీఆర్‌డీఓ ఏపీడీ శ్రీదేవి తెలిపారు. గురువారం మండల పరిధిలోని పోలంపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆమె పరిశీలించారు. పనిప్రదేశంలో ఉపాధికూలీలు పడుతున్న సమస్యలను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఓఆర్‌ఎస్ పాకెట్లు, మెడికల్ కిట్లు, తాగునీరు అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఏ జి.వసంత్, ఎఫ్ఏ కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ ధరావత్ భద్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

బోనకల్: రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారిని సరిత సూచించారు. గురువారం మండలంలోని ముష్టికుంట్ల, రావినూతల గ్రామాల్లో 'రైతునేస్తం' కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు అందిస్తున్న సలహాలను వివరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు దారగాని కల్యాణి, మరీదు త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయండి



మాట్లాడుతున్న షేక్ ఖాసీమ్

కొణిజర్ల: ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీ మేరకు రూ.లక్ష రుణమాఫీ చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు షేక్ ఖాసీమ్ అన్నారు. మండలంలోని విక్రమ్ నగర్‌లో నిర్వహించిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీళ్లు లేక ఎండిపోయిన పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. సుమారు 100 గ్రామాలకు తాగునీరు అందిస్తున్న వైరా రిజర్వాయర్ నీరు లేక ఎండిపోయే పరిస్థితి నెలకొందని. వెంటనే సాగర్ జలాలతో నింపి ప్రజలకు అందించాలన్నారు.

ఆకట్టుకున్న చిత్రకళా ప్రదర్శన



ఆర్ట్ గ్యాలరీని తిలకిస్తున్న విద్యార్థులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో ప్రపంచ చిత్రకారుడు రాజా రవివర్మ జయంతి సందర్భంగా ఆర్ట్ ఉపాధ్యాయుడు వీనస్ ఆధ్వర్యాన విద్యార్థులు గీసిన చిత్రాలతో గురువారం ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీ ఆకట్టుకుంది. ఇందులో పెన్సిల్ షేడింగ్, వాటర్ పెయింట్స్, ఆకులపై ఫ్యాబ్రిక్ పెయింట్స్, కార్టున్స్, జాతీయ నాయకులు, దేవతామూర్తులు, జంతువులు తదితర ప్రకృతి దృశ్యాలతో పాటు ఓటరు చైతన్యంపై పాఠశాల విద్యార్థులు గీసిన చిత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శరత్, షాకీర్, రామ్మోహన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని టౌన్-1 ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శరత్‌బాబు గురువారం తెలిపారు. జలగంనగర్, వేంసూరురోడ్, ఎన్టీఆర్‌నగర్, కృషి బైపాస్‌రోడ్, విద్యానగర్‌రోడ్, వాణీవిద్యాలయం, మిస్ట్ కళాశాల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడునుందని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దర్జాగా దందా..



నిండా ఇసుకతో పెద్దమండవ మున్నేరు ప్రాంతం

- పెద్దమండవ, గంధసిరి మున్నేరు తీరాన ఇసుక తోడేళ్లు
- యథేచ్ఛగా కొనసాగుతున్న అక్రమ రవాణా
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

ముదిగొండ: మండలంలో పెద్దమండవ, గంధసిరి మున్నేరుల నుంచి అక్రమార్కులు ఇసుకను తోడేస్తూ అమ్మేసుకుంటున్నారు. తమకు అనుకూలంగా ఉన్న దారులు ఎంచుకుని యథేచ్ఛగా తరలిస్తున్నారు. పట్టుపడినవారిపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు.

పెద్దమండవ మున్నేరు నుంచి అడ్డగోలుగా రవాణా జరుగుతుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. గంధసిరి నుంచి కూడా అదే తంతు జరుగుతోంది. ముదిగొండ పోలీస్ స్టేషన్ నుంచి పోలీసులు ఎవరు ఎటు బయలుదేరేది పక్కా సమాచారంతో కొంత మంది ఎస్కార్టులు ముందస్తుగా అక్రమార్కులకు సమాచారం అందజేయడంతో.. ఎక్కడ రవాణా అక్కడే ఆగుతుంది. పగలు లోడింగులు, రాత్రిళ్లు అక్రమ ఇసుక రవాణాలు జరుపుతుంటారు.

దాడుల్లో పట్టుపడిన వాహనాలు..

ఇటీవల సువర్ణాపురం క్రాస్ రోడ్డు వద్ద ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించగా.. ఎలాంటి అనుమతులు లేని ఐదు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. మైనింగ్, రెవెన్యూ అధికారులు మాత్రం నమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిరంతరాయంగా తిరుగుతూ..

గ్రామాల గుండా పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుక ట్రాక్టర్లు నిరంతరాయంగా తిరుగుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో అతివేగంగా వెళ్తుండడమే కాకుండా చేతిలో ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో చుట్టు పక్కల ప్రజలు ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు. ట్రాక్టర్లకు సరిగా నంబర్లు, లైసెన్స్‌లు ఉండవు కానీ.. దందా మాత్రం దర్జాగా సాగిస్తుంటారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు..

మున్నేరులలో ఇసుక తవ్వకాలను లోతుగా చేపట్టడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. సమీప ప్రాంతాలైన పండ్రేగుపల్లి, ముత్తారం, కోదండరామాపురం, వల్లాపురం, గంధసిరి, పెద్దమండవ, మల్లారం గ్రామాల ప్రజలకు మంచినీటి ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. దీంతో మంచినీటి బోర్లలో కూడా చుక్కనీరు రావడం లేదు.

పట్టించుకోని అధికారులు..

అక్రమ ఇసుక రవాణాను రెవెన్యూ, మైనింగ్ అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్క పోలీస్ అధికారులు మాత్రమే దాడులు నిర్వహిస్తు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నారు. అధికారులు చూసీచూడనట్లు ఉండడం వల్లే రెచ్చిపోయి మరీ పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. ఈ దందాకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు సైతం ఆందోళనలు చేస్తున్నారు.

ఇళ్లల్లో ఉండలేకపోతున్నాం..



తెల్లవారుజామున, రాత్రి సమయంలో ట్రాక్టర్లు రయ్యమని దూసుకుపోతున్నాయి. ఈ శబ్దాలకు మేము ఇళ్లలో ఉండలేకపోతున్నం. సరిగా నిద్ర కూడా పట్టడం లేదు. అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇకనైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని చర్యలు చేపట్టాలి.

– మొక్క నరసింహారావు, బాణాపురం

సిబ్బంది లేకపోవడంతో..



రెవెన్యూ సిబ్బంది సరిపడా లేకపోవడంతో ఆఫీసులోనే సరిపోతుంది. పోలీసులు దాడులు చేస్తున్నారు. పట్టుకున్నవారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారు. అక్రమార్కులను ఎవరిని వదిలేదిలేదు. కందకాలు తవ్విస్తాం. అక్రమ ఇసుక తరలించకుండా చూస్తాం.

– వై.రామారావు, తహసీల్దార్, ముదిగొండ



ఇసుక తీసుకెళ్తున్న ట్రాక్టర్లు

కార్మికులకు ఓఆర్‌ఎస్, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



మున్సిపల్ కార్మికులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

వైరా: వైరా మున్సిపాలిటీ కార్మికులు వడదెబ్బ బారీన పడకుండా మున్సిపల్ కమిషనర్ వేణు గురువారం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. పారిశుద్ధ్య కార్మికులు పని చేసే ప్రదేశాల్లో ఎండ తీవ్రత వలన ఇబ్బంది కలగకుండా తగు చర్యలు పాటించి పని సమయంలో నీడ ప్రదేశాలను ఆశ్రయించి సేదతీరాలని సూచించారు. అలాగే ఆరోగ్య నియమాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు..

సత్తుపల్లిరూరల్: రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేంరాజు ఆదేశాల మేరకు సత్తుపల్లిలోని జేవీఆర్‌ఓసీ-2లో గురువారం పీఓ ఎన్వీఆర్ ప్రహ్లాద్ ఉద్యోగులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు మజ్జిగ ప్యాకెట్లు జూన్ 15 వరకు పంపిణీ చేయటం జరుగుతుందని, యాజమాన్యం ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. దీంతో ఉద్యోగులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అదే విధంగా ఉద్యోగులు కూడా రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి తీసి సంస్థ అభివృద్ధికి పాటు పడాలన్నారు. సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేవీఆర్-2 మేనేజర్ పి.నర్సింహారావు, సంక్షేమ అధికారి దేవదాస్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ జి.నర్సింహారావు, ఐఎన్‌టీయూసీ ఫిట్ సెక్రటరీ ఎస్.రామారావు, ఉద్యోగులు పాల్గొన్నారు.



సింగరేణి కార్మికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న పీఓ ఎన్వీఆర్ ప్రహ్లాద్

హ్యూమన్‌రైట్స్ జిల్లా కార్యాలయం ప్రారంభం



మాట్లాడుతున్న హ్యూమన్‌రైట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు

వైరా: హ్యూమన్ రైట్స్ జిల్లా కార్యాలయాన్ని వైరా పట్టణంలో గురువారం హ్యూమన్‌రైట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బొడ్డుపాటి దాసు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలు నిరంతరం రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన తరగతులు నిర్వహిస్తూ ప్రజలకు చట్టాల గురించి తెలియజేస్తూ చైతన్య పరచాలన్నారు. ప్రజలలో మానవ హక్కులపై అవగాహన కలిపించే ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేయాలన్నారు. ఈ కార్యాలయ ఏర్పాటుకు కృషి చేసిన సంఘం సభ్యులు ఆదూరి మణి, ఆదూరి ఆనందం లను అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జాతీయ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కోట వెంకట్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తేళ్లూరి ఏసు, రాష్ట్ర కోఆర్డినేటర్ కె.వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, రోషిణి, వివిధ మండలాల సభ్యులు పాల్గొన్నారు.

1,500 ఎకరాల్లో అపరాల సాగు

కొణిజర్ల: మండలంలో సుమారు 1,500 ఎకరాల్లో అపరాల సాగు చేస్తున్నట్లు మండల వ్యవసాయాధిరి డి.బాలాజీ అన్నారు. గురువారం మండలంలోని సింగరాయపాలెంలో పెసర పంటను ఆయన పరిశీలించి మాట్లాడారు. కొణిజర్ల మండలం అపరాల పంట సాగు చేసి మంచి దిగుబడులు సాధించి జిల్లాకే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఎన్నెస్పీ నీళ్లు రాకపోయినా పంటలు సాగుచేయడం అభినందనీయం అన్నారు. 100 రోజుల్లో రైతులు పెట్టిన రూ.10 వేలు పెట్టుబడి పోను రూ.30 వేల వరకు లాభం వస్తుందన్నారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 8,800 ఎకరాల్లో అపరాల సాగు చేయగా ఒక్క కొణిజర్ల మండలంలోనే 1,500 ఎకరాలు సాగుచేయడం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు స్థానిక రైతులు పాల్గొన్నారు.



సింగరాయపాలెంలో పెసర పంటను పరిశీలిస్తున్న ఏఓ బాలాజీ

సంబరంగా మాధారం పాఠశాల వార్షికోత్సవం



నాటిక ప్రదర్శించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కారేపల్లి: మండలంలోని మాధారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం పాఠశాల వార్షికోత్సవ వేడుకలు సంబరంగా సాగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన మూడు చేపల కథ నాటిక, ఏ మిస్టేక్ ఆంగ్ల నాటిక, విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టున్నాయి. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.మల్లేశ్వరరావు, అన్నవరపు దామోదరరావు, జి.వెంకటేశ్వర్లు, బి.వెంకటరెడ్డి, డి.నాగభూషణం, మృదుభాషిని, హెచ్.భద్రు, ఎం.చైతన్యలక్ష్మి, నాగులమీరా, వీఓ లు సమ్మక్క, శ్రీను పాల్గొన్నారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు



ఎర్రుపాలెంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో గురువారం అర్చకులు సాంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. బాబాకి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. భక్తులు బాబాని దర్శించుకున్నారు. మండలకేంద్రంలోని ఆలయంలో సాయినిలయంలో బుచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన వేమిరెడ్డి వెంకటరెడ్డి-త్రివేణి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కంఠమహేశ్వరస్వామి ఆలయంలో పూజలు



కంఠమహేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ముదిగొండ: మండలంలోని మాధాపురంలో గురువారం గౌడసంఘం ఆధ్వర్యంలో కంఠమహేశ్వరస్వామి సురమాంబ దేవాలయంలో సామూహిక పూజలు నిర్వహించారు. ఆలయాన్ని నిర్మించి 16రోజులు అయిన సందర్భంగా గ్రామంలో కంఠమహేశ్వరస్వామి, సురమాంబదేవి, వనం ఎల్లమ్మ, వనంమైసమ్మ దేవతలకు అర్చకులు అభిషేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడసంఘం ప్రతినిధులు తేరాల యాదగిరిగౌడ్, కసగానికి యుగంధర్‌గౌడ్, అంతటి రాములుగౌడ్, తేరాల ఉపేందర్‌గౌడ్, తేరాల భూషయ్యగౌడ్, ఉడతల సైదులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమావేశం

వైరా: వైరాలోని పాత శ్రీనికేతన్ పాఠశాల ఆవరణలో శుక్రవారం బీఆర్‌ఎస్ వైరా నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం వైరాలో ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసేందుకు సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగిస్తారన్నారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య రాకూడదు..



మర్లపాడులో నీటి మోటర్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, అధికారులు

వేంసూరు: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులకు సూచించారు. గురువారం మండలంలోని లింగపాలెం, వేంసూరు, మర్లపాడు, అమ్మపాలెం గ్రామాల్లో పర్యటించారు. లింగపాలెం, మర్లపాడు పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి తగిన సూచనలు, సలహాలు అందించారు. అలాగే అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా వచ్చేజూన్ నాటికి పాఠశాలల అభివృద్ధి పనులు పూర్తి చేసి పాఠశాలలు కళకళలాడే లాగా చూడాలని సూచించారు. వేంసూరు డబుల్‌బెడ్‌రూం కాలనీలో తాగునీటి సమస్యలపై ఆర్‌డబ్ల్యూస్ జయలక్ష్మిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే సమీపంలోని రైతుల దగ్గర నుంచి తాగునీరు అందేలా చూడలన్నారు. అదే విధంగా అమ్మపాలెం పంచాయతీలో తమకు మిషన్ భగీరథ నీరు ఇంత వరకు రావడం లేదని గ్రామస్తులు తెలుపగా.. తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ రంజిత్ కుమార్, ఆర్‌డబ్ల్యూస్ జేఈ జయలక్ష్మి, ఆర్‌అండ్‌బీ ఏఈ ప్రకాష్, పీఆర్ ఏఈ సాయికృష్ణ, ఎంఈఓ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, ఆయా పాఠశాల హెచ్‌ఎంలు ఉన్నారు.

రైతాంగ సమస్యలపై రేపు కల్లూరులో దీక్ష



మాట్లాడుతున్న వెంకటవీరయ్య

కల్లూరురూరల్: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 6న కల్లూరులో రైతుదీక్ష చేపడుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. కల్లూరులో గురువారం రాత్రి బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రైతులు అనేక రకాలుగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సాగునీరు సక్రమంగా సరఫరా చేయక పోగా రైతుబంధు ఇవ్వలేదని, ధాన్యం కొనుగోళ్లు సరిగ్గా చేయడం లేదని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు చేస్తే బోనస్ ఇవ్వాల్సి వస్తుందని భయంతోనే ప్రభుత్వం ఈ రకంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ మేరకు రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చేపట్టనున్న దీక్షను విజయవంతం చేయాలని సండ్ర కోరారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పాలెపు రామారావుతో పాటు ఎండీ.ఇస్మాయిల్, బోబోలు లక్ష్మణరావు, నర్వనేని అంజయ్య, మేకల కృష్ణ, పెద్దబోయిన మల్లేశ్వరరావు, సర్రాబు వెంకటేశ్వరరావు, దేవరపల్లి భాస్కర్‌రావు, పెడకంటి రామకృష్ణ, ఎస్‌కే కమ్లి, కొరకొప్పు ప్రసాద్, సీహెచ్.కిరణ్ పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మధిర: విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎంఈఓ వై.ప్రభాకర్ అన్నారు. మండలంలోని నాగవరప్పాడు ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ఏడో తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల ల్లోనే నాణ్యమైన విద్యను అందించటం జరుగుతుందని, పిల్లల భవిష్యత్ తరగతి గదుల్లో నిర్ణయించబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం చెరుపల్లి శ్రీహరి, పాఠశాల హెచ్‌ఎం పురం సంగారావు, ఉపాధ్యాయులు మేడిశెట్టి కృష్ణారావు, గడ్డం నాగేంద్రమ్మ, కట్టా శ్రీలత, తెల్లమేకల శ్రీనివాసరావు, పాఠశాల కమిటీ చైర్మన్ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

వీడ్కోలు సమావేశం..

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పి.నాగేశ్వరరావు అధ్యక్షతన పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం పి.యాకూబ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'విజయ'లో ముగిసిన ఆవిష్కార్-2024



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రముఖులు

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల విజయ ఇంజనీరింగ్ కళాశాలలో గత రెండురోజులుగా నిర్వహించిన జాతీయ స్థాయి టెక్నికల్, కల్చరల్ సింపోజియం ఆవిష్కార్ 2024 గురువారం రాత్రి ముగిసింది. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథులుగా కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఘంటా రమేష్, కవిత విద్యాసంస్థల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్, వైస్ చైర్మన్ విజయలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులంతా నేర్చుకున్న విద్యను జీవితానుభవానికి ఉపయోగించాలన్నారు. ఇప్పటికే క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో మంచి ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా సినీ గాయకుడు, సంగీత దర్శకుడు వి.హేమచంద్ర బృందం తమ గానంతో ఆకట్టుకోగా.. విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకర్షించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాన్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నయ్య, అకడమిక్ డీన్ డాక్టర్ శ్రీనివాసరావు, ప్రోగ్రామ్ కోకన్వీనర్ డాక్టర్ ఆయేషా తరుణమ్ వివిధ విభాగాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

ఆదివాసీలపై దాడులు సరికాదు



మాట్లాడుతున్న నాగేశ్వరరావు


సత్తుపల్లిరూరల్: బుగ్గపాడులో ఆదివాసీలపై జరిగిన దాడికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని.. పోలీసులు దాడులు చేయడం సరికాదని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి జి.నాగేశ్వరరావు అన్నారు. గురువారం బుగ్గపాడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రాయపాలెం ఘటనలో అక్రమంగా కేసులపాలైన బుగ్గపాడు బాధిత కుటుంబాలను పరామర్శించినట్లు తెలిపారు. జామాయిల్ వల్ల వచ్చిన ఆదాయాన్ని కొందరు రైతులకు ఇచ్చి.. మిగతావారికి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. మహిళలు అని చూడకుండా విచక్షణా రహితంగా గాయపర్చిన పోలీసుల దాడులను ప్రజాస్వామిక వాదులు, మేధావులు ఖండించాలన్నారు. సమావేశంలో ములకలపల్లి సబ్ డివిజన్ కార్యదర్శి కె.కృష్ణ, జిల్లా మహిళా అధ్యక్షురాలు వీరమళ్ల ఉమా, కె.సత్యనారాయణ, ఆదినారాయణ, సురేష్, వెంకటేష్, వైఎస్ రెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

గ్రామాల్లో నాయకుల పర్యటన

ప్రసాదరెడ్డి పర్యటన..

కొణిజర్ల: ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకుడు, రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు పొంగులేటి ప్రసాదరెడ్డి గురువారం మండలంలోని తనికెళ్ల, అమ్మపాలెం, పెద్దమునగాల, చిన్నమునగాల గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురి బాధితులను పరామర్శించి, పలు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి నూతన వస్త్రాలు అందించారు. ఆయన వెంట మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, ఎంపీపీ గోసు మధు, నాయకులు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లిలో దయాకర్‌రెడ్డి..



కాంగ్రెస్ నాయకుడు నాగేశ్వరరావును పరామర్శిస్తున్న దయాకర్‌రెడ్డి

కారేపల్లి: మండలంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తంబూరి దయాకర్‌రెడ్డి పర్యటించారు. పేరుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బండారి నాగేశ్వరరావు అనారోగ్యానికి గురికావడంతో ఆయనను పరామర్శించి.. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అదే గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బానోత్ వీరభద్రం-పద్మల కుమార్తె నందిత-కుమార్‌ల వివాహ వేడుకకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఆయన వెంట మాజీ మార్క్‌ఫెడ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు తిరుపతిరావు, దేవ్లానాయక్, ఎంపీటీసీ ఈశ్వరీనందరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు తుమ్మల ఆశీర్వాదం..

కొణిజర్ల: మండలంలోని తీగలబంజరకు చెందిన మండల కాంగ్రెస్ నాయకుడు కొలిపాక వెంకటేశ్వర్లు, మంగమ్మ దంపతుల కూమార్తె నాగరాణి వివాహం నందకిషోర్‌తో జరిగింది. ఈ సందర్భంగా గురువారం రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ పట్టు పరిశ్రమల శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వధువు ప్రధానం కార్యక్రమానికి హాజరై ఆమెను ఆశీర్వదించారు.

తిమ్మినేనిపాలెం గ్రామంలో జెడ్పీ చైర్మన్..

చింతకాని: మండలంలోని తిమ్మినేనిపాలెం గ్రామంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు తెల్లగొర్ల కృష్ణ నివాసంలో గురువారం జరిగిన వివాహ వేడుకలో జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్ పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పుల్లయ్య, నాయకులు లచ్చయ్య, మదార్‌సాహెబ్, భిక్షం, జయరాజు, మీరాసాహెబ్, గోపి పాల్గొన్నారు.